వామ్మో.. దుమ్ము

- రోడ్డును ఇసుకతో కప్పేస్తున్నారు
- ప్రమాదకరంగా మల్లయ్యపేట – కాతేరు ప్రధాన రహదారి
- దుమ్ము రేగి వాహన చోదకుల అవస్థ
- ప్రమాదం అంచునే ప్రయాణం

రాజమహేంద్రవరం రూరల్: మల్లయ్యపేట – కాతేరు ప్రధాన రహదారి మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కాతేరు, కోటిలింగాల రేవు, సీతానగరంలోని ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక తరలించే వాహనాలు ఈ రోడ్డు మీదుగానే వెళుతున్నాయి. దీంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనతో హడలిపోతున్నారు. తారు రోడ్డుపై కొన్ని అంగుళాల ఎత్తు వరకు ఇసుక పేరుకుపోయింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలే కాకుండా కార్లు కూడా ఈ ఇసుక కారణంగా అదుపు తప్పుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ రోడ్డుగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహన చోదకులు అంటున్నారు.

తరచూ ప్రమాదాలు

మల్లయ్యపేట – కాతేరు ప్రధాన రహదారి ముఖ్యంగా రాజమహేంద్రవం సిటీ వైపు నుంచి సీతానగరం వైపు వెళ్లే వారికి, అలాగే సిటీ శివార్లలోని విద్యా సంస్థలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉంది. ఈ నేపథ్యంలో నిత్యం మహిళలు, విద్యార్థులు, చిరుద్యోగులు ఈరోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. తారు రోడ్డుపై ఇసుక పేరుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

ఇసుకను తరలించే వాహనాలపై బరకాలు కప్పి తీసుకువెళ్లాలని నిబంధనలున్నా అక్రమ రవాణాకు తెరతీస్తున్న ఇసుక మాఫియా దీనిని పట్టించుకోవడం లేదు. దీంతో ఇసుక లోడుతో వెళ్లే లారీలు, ట్రాక్టర్లు రోడ్డు మొత్తం ఇసుకను చల్లుకుంటూ పోతున్నాయి. అలా రోడ్డు మీదకు చేరిన ఇసుక ప్రమాదాలకు కారణమవుతోంది. అంతే కాకుండా మల్లయ్యపేట – కాతేరు మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు, దుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు తమ వ్యాపారాలను దుమ్ము కారణంగా మూసేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

రోడ్డుపై ఇసుకతో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము తమ షాపుల్లోకి చేరుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తినుబండారాల బడ్డీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు ఈ దుమ్ము కారణంగా గిరాకీ లేకుండా పోతోంది. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ఇతర వ్యాపారులు, నివాసితులు నిత్యం నీటిని చల్లుకుని దుమ్ము, ధూళి రేగకుండా చర్యలు చేపడుతూ నానా పాట్లు పడుతున్నారు. అక్రమంగా ఇసుకను తరలించిన వారు డబ్బులు సంపాదించుకుంటున్నారని, ప్రమాదం అంచున ప్రయాణించడంతోపాటు, దుమ్మూ, ధూళితో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

దుమ్ముతో తప్పని ఇక్కట్లు



రోడ్డుపై ఇసుక వలన లారీలు, ఇతర వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము రేగుతోంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపుల్లోకి సైతం దుమ్ము, ధూళి చేరడంతో వ్యాపారులు రోడ్డుపై నీళ్లు చల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను తొలగించాలి.

– గుత్తుల ఉమాశంకర్, మల్లయ్యపేట, కాతేరు



మల్లయ్యపేట వద్ద ఇసుకతో రోడ్డంతా దుమ్ముమయం



కాతేరులో అంబేడ్కర్ బొమ్మ వద్ద రోడ్డుపై ఇసుక పొర



దుమ్ము లేవకుండా వ్యాపారులు తడిపిన రోడ్డు

క్లుప్తంగా

మొక్కల పంపిణీ

కడియం: మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి శనివారం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు ప్రత్తిపాటి రామారావు చౌదరి, జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీ. రమేష్, ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీను, పడాల బాబీ, రాముడు, వీర్రాజు, ధనుంజయ పాల్గొన్నారు.

ఆంధ్ర కేసరి జూనియర్ కళాశాల కరస్పాండెంట్‌గా కోళ్ల బాబు

సీటీఆర్ఐ: ఆంధ్ర కేసరి సెంటినరీ జూనియర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు) ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన కళాశాల పాలకవర్గ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నట్టు తీర్మానించారు. పాలకవర్గం వైస్ చైర్మన్‌గా దాసరి వెంకటకృష్ణ రమేష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని కళాశాల చైర్మన్ జెట్టి ప్రసాదరావు, గౌరవ కార్యదర్శి జమ్మి రామారావు, ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్ష, కార్యదర్శులు వి.భాస్కరరామ్, ప్రసాద్ రెడ్డి అభినందించారు.

దుస్తులకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేటలోని చిన గాంధీ బొమ్మ ప్రాంతానికి చెందిన కటకం లక్ష్మీ (70) దుస్తులకు నిప్పంటుకుని తీవ్ర గాయాలతో మృతి చెందింది. దీనికి సంబంధించి ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కటకం లక్ష్మీ శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటిలో పూజ చేసుకుంటూ దీపం వెలిగించింది. ఆ సమయంలో ఆమె దుస్తులకు నిప్పంటుకుంది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో లక్ష్మీ శరీరమంతా కాలిపోయింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ ఐ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ప్రతిభను కనబర్చారని వారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 110 మందికి 108 మంది పాసవడంతో 98 శాతం ఉత్తీర్ణతను, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరైన 31 మంది ఉత్తీర్ణులై నూరుశాతం ఫలితాలు సాధించారన్నారు. మొదటి సంవత్సరం జనరల్‌లో 165 మందికి 131 మంది, ఒకేషనల్‌లో 67 మందికి 56 మంది ఉత్తీర్ణులై 79 శాతం ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమైనట్టు తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

అనపర్తి : మండలంలోని పొలమూరు గ్రామం తూర్పు పేటలో కొలువై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. రామచంద్రపురానికి చెందిన విశ్వబ్రాహ్మణ పురోహితులు బ్రహ్మశ్రీ అత్తిలి శివ రామకృష్ణ, కొడమంచిలి సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో మానేపల్లి వీరబ్రహ్మం, ఝాన్సీలక్ష్మీ దంపతులతో స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి తిరు కల్యాణోత్సవం



సీతానగరంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

సీతానగరం: స్థానిక విష్ణు ఆలయంలో వేణుగోపాలస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మద్దూరి నాగార్జున శర్మ, ప్రధాన అర్చకులు వేదాంతం కేశవచార్యుల ఆధ్వర్యంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి 10.30 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. ఏటా జ్యేష్ఠమాస, శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో పాటి సత్యనారాయణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

50 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట: మండలంలోని సారా తయారీ నిందితులను అరెస్టు చేసినట్లు రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. శనివారం మండలంలోని దొంతమూరులో దాడులు నిర్వహించగా 50 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు.1,800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బుక్కచక్రవర్తి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. గండి సూర్యనారాయణపై కేసు నమోదు చేశామన్నారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

రాజమహేంద్రవరం రూరల్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్‌ను వెబ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గానే నిర్వహించాలని ఉపాధ్యాయుల ఐక్యవేదిక (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హుకుంపేట మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఈవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో యూనియన్లు జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించేందుకు అంగీకరించారన్నారు. ఇప్పుడు అధికారులు మాన్యువల్‌గా నిర్వహించడం సాధ్యం కాదని, కేవలం వెబ్ ద్వారా మాత్రమే బదిలీలు జరుపుతామని ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు ఈ నిర్ణయాన్ని వాయిదా వేసుకోకపోతే ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాస్, ప్రకాష్, పద్మజ, రాజు, ప్రసాద్, జిలానీ హాజరయ్యారు.



విద్యా వనరుల కేంద్రం వద్ద వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

వృద్ధులకు సహాయం చేయడం గొప్ప సంకల్పం



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న వికాస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ యార్లగడ్డ ప్రభాకర్ అభినందనీయులని, వృద్ధులకు సహాయం చేయడం ఓ గొప్ప సంకల్పమని డాక్టర్ నల్లి చిట్టిబాబు అన్నారు. వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అందజేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం స్థానిక వీఎల్ పురం పార్కులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ వికాస్ సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేందుకు వీలుగా వికాస్ సంస్థ 192 మందికి ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమన్నారు. 150 మందికి రూ.200 చొప్పున పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుబ్బల వెంకట రమణ, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో మెరుగైన ఉత్పత్తులు

కడియం: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా మెరుగైన, నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చని వేమగిరి డీఎఫ్ఆర్‌సీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డీవీఎస్ రాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేమగిరి డీఎఫ్ఆర్‌సీలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు మాట్లాడుతూ పూల పంట సాగు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆర్కిడ్స్ ఎక్కువగా ఎగుమతికి అవకాశం ఉందని, వీటి సాగుతో రైతులు మంచి లాభాలు అర్జించవచ్చని అన్నారు. కడియం హార్టీ కల్చర్ ఆఫీసర్ డి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పూలు, కూరగాయల పంట సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలను తెలియజేసారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సబ్సిడీ ఉందన్నారు. కొబ్బరిలో అంతర పంటలుగా కోకో, అరటి తదితర పంటల సాగుతో రైతుకు అదనపు ఆదాయం ఉంటుందన్నారు. కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ వికసిత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రతి రోజు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, నూతన విధానాల రూపకల్పన చేస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎస్ఐఆర్‌సీఏ క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ హెడ్ డాక్టర్ సరళ మాట్లాడుతూ పురుగు మందుల వాడకం తగ్గించి, ఆర్గానిక్ ఫార్మింగ్ ద్వారా భూమి ఆరోగ్యాన్ని పెంచవచ్చన్నారు. ఈ కార్యక్రమలలో అగ్రికల్చర్ ఆఫీసర్ కె.ద్వారకాదేవి, సైంటిస్టులు శిరీష, మాధవన్, లక్ష్మీపతి, అజ్వంత్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నర్సరీ రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపక్షాన పోరాడుతాం

సీతానగరం: పథకాల అమలు కోసం ప్రజాపక్షాన పోరాడతామని, కక్ష సాధింపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆపార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం చినకొండేపూడిలో వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు ఇంటి ఆవరణలో, పెదకొండేపూడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శా కార్యకర్తలు – నా కుటుంబం కార్యక్రమంలో జక్కంపూడి రాజా పాల్గొని పార్టీ బలోపేతం కోసం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుకు ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్పందన వచ్చిందన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

పేదలకు అందని వైద్యం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకపోగా దోపిడీయే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. విద్యుత్తు చార్జీల బాదుడుతో రాష్ట్ర ప్రజలను దోచేస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదని, పేదలకు వైద్యం అందక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యమయ్యాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ స్కామ్‌ల పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. కూటమి పాలనలో అన్నీ మోసాలే తప్ప ప్రజలకు లబ్ధి చేకూరిందేమీ లేదని ఆక్షేపించారు.



చినకొండేపూడిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

నియోజకవర్గంలో మట్టి, ఇసుక దోపిడీ

నియోజకవర్గంలో మట్టి, ఇసుక దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. నా కార్యకర్తలు – నా కుటుంబం పేరుతో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొంటామన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎదుర్కొందామని జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చేకూరి నాని, నియోజకవర్గం ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు, సర్పంచ్ చేకూరి పాల్ శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు, ఇంద్ర, మురార్జీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు

కాగితం రహిత డాక్యుమెంట్ విధానంతో ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్బారావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న కాగితం రహిత డాక్యుమెంట్ విధానంతో ఇబ్బందులు తలెత్తుతాయని దీనిపై పునరాలోచన చేయాలని ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు బీఎస్‌వీ సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం రాజమహేంద్రవరం అరుణ ప్యాలెస్‌లో ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. మరలా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో పాటు కాగిత రహిత డాక్యుమెంట్ విధానాన్ని తీసుకువస్తోందన్నారు. కాగితం రహిత డాక్యుమెంట్ విధానంలో డిజిటల్ లాకర్‌లో డాక్యుమెంట్లు ఉంటాయన్నారు. చేతికి ఎటువంటి డాక్యుమెంట్లు ఇవ్వకుండా చేసే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నిరక్షరాస్యులు ఈ విధానంతో అధికంగా ఇబ్బందులు పడతారన్నారు. ఈ విధానంపై ఈనెల 25వ తేదీలోగా దస్తావేజు లేఖర్లు అభ్యంతరాలు తెలపాలని కేంద్ర ప్రభుత్వం కోరిందన్నారు. ఈ నేపథ్యంలోనే రాజమండ్రిలో రాష్ట్ర దస్తావేజు లేఖర్లతో సమావేశం నిర్వహించామన్నారు. నూతన విధానం అమలు వలన రాష్ట్రంలో లక్ష మందికి పైగా దస్తావేజు లేఖర్లు, వీరిపై ఆధారపడే కంప్యూటర్ ఆపరేటర్లు, అసిస్టెంట్ల ఉపాధి దెబ్బతిని వారంతా రోడ్డున పడతారన్నారు. దస్తావేజు లేఖర్ల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లతామని సుబ్బారావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యపై పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు అందిస్తామన్నారు.ఈ సమావేశంలో లీగల్ ఎడ్వైజర్ బీజే ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదే రవికుమార్, సంఘం జేపీసీ సభ్యుడు మజ్జి గణపతి రావు, విశాఖ జిల్లా నేత ఎస్‌సీహెచ్‌వీ రామకృష్ణ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు కోలారామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

19న అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన

పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచేలా అఖండ గోదావరి ప్రాజెక్ట్ చేపట్టడం జరుగుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు జూన్ 19న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో శనివారం సభా వేదికగా, బహిరంగ సభ తదితర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే విద్యార్థులకు, పర్యాటకులకు, అటవీ సంరక్షణకు ఉపయోగపడేలా ప్రాజెక్ట్ రూపొందిస్తామన్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టు వద్ద అఖండ గోదావరి ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బొమ్మూరులోని సైన్స్ మ్యూజియం ప్రారంభిస్తారని తెలిపారు. రాజానగరం నియోజకవర్గంలో అటవీ అకాడమీకి శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిషోర్, మునిసిపల్ కమిషనర్ కేతన గార్గ్, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ తదితరులు

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కోరుకొండలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయం



నూతన ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ: వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కోరుకొండలో వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన ఆలయం, విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు, హోమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 7.39 గంటలకు ఆలయ ప్రతిష్ఠతోపాటు స్వామివారి నూతన విగ్రహం, విమాన శిఖర, శిలా జీవ ధ్వజ మయూర, సర్పబంధ విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాణింగపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు, ఆగమ పండితులు ఇంద్రగంటి విశ్వనాథశర్మ, ఆలయ అర్చకులు కాళ్లకూరి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

పుట్టకొండలో ఘనంగా ముగిసిన సప్తాహం

పెదపూడి: భక్తి శ్రద్ధలతో వారం రోజుల పాటు పుట్టకొండ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద వైభవంగా సప్తాహం నిర్వహించామని సర్పంచ్ వల్లు వెంకటరమణ చెప్పారు. ఈ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారామచంద్రస్వామి ప్రథమ సప్తాహం కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ప్రముఖ పండితులు పి.కమలాకర్, చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ ముగింపు సందర్భంగా సుమారు 4వేల మందికి గ్రామస్తులు, భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించామన్నారు. గ్రామంతోపాటు కుమారప్రియం, కైకవోలు, కాండ్రేగుల, సంపర, చింతపల్లి, గండ్రేడు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు. గ్రామంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన ఈ సప్తాహం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేశారని సర్పంచ్ తెలిపారు.



పుట్టకొండలో అన్నదానం నిర్వహిస్తున్న సప్తాహం కమిటీ ప్రతినిధులు పాల్గొన్న భక్తులు

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన కోటపాడు విద్యార్థిని

రంగంపేట: మండలంలోని కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని పచ్చిపాల మౌనిక లక్ష్మీప్రియ నేషనల్ మెరిట్స్ అండ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ.2 వేలు చొప్పున నాలుగేళ్లపాటు ఈ ఉపకారం వేతనం ఆమెకు అందుతుందన్నారు. ఈ సందర్భంగా మౌనిక లక్ష్మీప్రియను పాఠశాల కమిటీ, విద్యా కమిటీ, నాయకులు తదితరులు అభినందించారు.



పచ్చిపాల మౌనిక లక్ష్మీ ప్రియ

గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలి



శ్రీరామనగరంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

సీతానగరం: గ్యాస్ వాడకం – భద్రతపై జయ రోహన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని పెందుర్తి దేవదాసు, మేనేజర్ కె రఘు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాపాక పంచాయతీ పరిధిలో శ్రీరామనగరం పాఠశాల ఆవరణలో మహిళలకు గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ట్యూబ్‌ను ఐదేళ్లకు ఒకసారి మార్చాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కన మరో ఫుల్ సిలిండర్ ఉంచరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

వృద్ధాశ్రమంలో భోజనాల వితరణ

అనపర్తి : రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనపర్తి శ్రీతేతలి రామిరెడ్డి, మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు ఏపీఈపీడీసీఎల్ 11 జిల్లాల షిఫ్ట్ ఆపరేటర్స్ ప్రతినిధి, డిస్కమ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కురసాల జ్యోతికుమార్ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తేతలి నారాయణరెడ్డి, డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి, చేవలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	థగ్‌లైఫ్
సూర్యమినీ	:	ఫైనల్ డెస్టినేషన్, మిషన్ ఇంపాజిబుల్
సూర్యప్యాలెస్	:	థగ్‌లైఫ్
స్వామి	:	శ్రీశ్రీశ్రీ రాజావారు
శివజ్యోతి	:	బద్మాషులు,ఢీ
అనుశ్రీ	:	గ్లాంబర్స్
రాజా	:	భైరవం
ఊర్వశి	:	థగ్‌లైఫ్
మేనక	:	పాడేరు 12వమైలు, మిషన్5007
రంభ	:	ఫైనల్ డెస్టినేషన్
అప్సర	:	సింగిల్
కుమారి	:	వర్షం
అశోక	:	భైరవం
నామవరం		
వీఎస్ మహల్	:	థగ్‌లైఫ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	థగ్‌లైఫ్
కడియం		
వెంకటసూర్య	:	థగ్‌లైఫ్